క్లుప్తంగా

ఉన్నతంగా ఎదిగేందుకు మార్గదర్శనం చేయాలి

- ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకుడు సయ్యద్ మతిన్ అహ్మద్



మాట్లాడుతున్న సయ్యద్ మతిన్ అహ్మద్

లింగాలఘణపురం: విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా ఉపాధ్యాయులు మార్గదర్శనం చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకుడు సయ్యద్ మతిన్ అహ్మద్ అన్నారు. సోమవారం మండలంలోని కుందారం ఉన్నత పాఠశబూల, మండలం కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. జీసీడీఓ గౌసియాబేగం, కుందారంలో ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ శ్రీనివాసు, కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్



మాట్లాడుతున్న సుధీర్

కొడకండ్ల: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దృష్టిలోపం ఉండి ఆర్థిక ఇబ్బందులతో కంటి ఆపరేషన్లు చేయించుకోలేని వారికి ఇలాంటి శిబిరాలు ఎంతో చేయూతగా ఉంటాయన్నారు. స్థానిక డాక్టర్ హరికృష్ణ, ప్రగతి సేవా సమితి వ్యవస్థాకుడు గద్దల జాన్,పీడీ రామ్మూర్తి, కొడకండ్ల, పాలకుర్తి మండలాల కోఆర్డీనేటర్లు ఉపేందర్, ఎల్లయ్య, వీసీఓలు అంజయ్య, శ్రీలత, సంతోష, స్రవంతి, సుకన్య ఉన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

స్టేషన్‌ఘన్‌పూర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 25న ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపాన ఉన్న ఈఆర్‌ఎల్ గార్డెన్స్‌లో ముస్లింలకు అధికారికంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

12 మండలాలు.. మూడే అర్జీలు

తహసీల్ 'గ్రీవెన్స్'కు స్పందన కరువు

- అర్జీదారులకు నమ్మకం లేకనే..
- పరిష్కారం అయ్యే దరఖాస్తులు సైతం కలెక్టరేట్‌కే

జనగామ/సాక్షి నెట్‌వర్క్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌కు తోడు.. 12 మండలాల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సైతం నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గతంలోనే ఆదేశాలు జారీ చేశారు. కానీ తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌పై పెద్దగా ప్రచారం నిర్వహించకపోవడంతో చాలా మంది కలెక్టరేట్ బాట పడుతున్నారు. మండలంలో పరిష్కారం అయ్యే సమస్యలు సైతం జిల్లా కేంద్రానికి వచ్చేలా చేస్తోంది. ఈ నేపథ్యంలో 'పరిష్కారం అంతంతే' శీర్షికన సాక్షిలో ఈ నెల24వ తేదీన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించగా.. తహసీల్దార్లు అప్రమత్తమయ్యారు. ఉదయం 10 గంటలకే తహసీల్‌కు చేరుకుని గ్రీవెన్స్‌కు సిద్ధం కాగా.. సాక్షి బృందం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గ్రీవెన్స్‌కు ఎవరెవరు వస్తున్నారు, సమస్యల పరిష్కారం కోసం ఎన్ని రోజులుగా తిరుగుతున్నారనే దానిపై ఫోకస్ పెట్టింది. కానీ 10 మండలాల పరిధిలో ఒక్కటంటే ఒక్క అర్జీ రాకపోగా, రెండు మండలాల్లో మాత్రం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. అర్జీదారులు తహసీల్ ఆఫీస్‌కు వెళ్లకుండా నేరుగా కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో తహసీల్దార్లు, అధికారులపై నమ్మకం కలగడం లేదనే ప్రచారం జరుగుతోంది. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను పరిశీలించి, సాధ్యమైన వాటిని పరిష్కరించి ప్రజల్లో నమ్మకం కలిగించాలని అంటున్నారు.



లింగాలఘణపురంలో దరఖాస్తుల కోసం ఎదురు చూస్తున్న అధికారులు

మండలాల్లో ఇలా..

చిల్పూరు, జఫర్‌గఢ్, కొడకండ్ల, బచ్చన్నపేట, లింగాలఘనపురం, రఘునాథపల్లి, జనగామ రూరల్, దేవరుప్పుల, నర్మెట తహసీల్దార్లు సరస్వతి, శంకరయ్య, కోల చంద్రమోహన్, ప్రకాశ్, రవీందర్, కలకుంట్ల వెంకట రామానుజాచార్యులు ఒక్క అర్జీ కూడా రాలేదని తెలిపారు. పాలకుర్తిలో-1, స్టేషన్ ఘన్‌పూర్‌లో-2 మినహా మిగతా 10 మండలాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా రాకపోవడం గమనార్హం.



కొడుకులకు రాసిచ్చిన భూ రిజిస్ట్రేషన్ రద్దు చేయండి

గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ వైద్యం కోసం చేతిలో చిల్లిగవ్వ లేక కొడుకులకు రాసిచ్చిన భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన 78 ఏళ్ల వృద్ధుడు దుంప సోమల్లు గ్రీవెన్స్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. తండ్రి బయటకు వెళ్లిన కొద్దిసేపటికే పెద్ద కుమారుడు వచ్చి తన భూమిని విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటికే వృద్ధుని గోసవిని చలించిపోయిన తహసీల్దార్ శ్రీనివాస్.. కన్నతండ్రికి ఇస్తానన్న డబ్బులు ఇవ్వలేని పక్షంలో ముగ్గురు కుమారుల పేరిట చేసిన భూ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తానని హెచ్చరించారు. ఆదిలాబాద్‌లో సంపాదించుకున్న ప్లాటును సైతం పెద్ద కుమారుడు స్వాధీనం చేసుకుని రూ.22 లక్షలకు ఇతరులకు విక్రయించాడు. అంతకు ముందు పోలీసులను ఆశ్రయించగా, ముగ్గురు కుమారులను పిలిపించి రూ.9లక్షలు ఇవ్వాలని చెప్పగా, అందుకు అంగీకరించారు. అదే సమయంలో గుండె సమస్య రాగా, మెరుగైన వైద్య పరీక్షల కోసం కొడుకులను డబ్బులు అడిగితే, బెదిరింపులకు దిగడంతో సోమల్లు తహసీల్దార్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌కు రాకతప్పలేదు.

పరీక్ష కేంద్రంలో కలెక్టర్ పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో జరుగుతున్న పరీక్షల సరళిని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సెంటర్‌ను, హోలీ క్రాస్ స్కూల్ సెంటర్‌ను ఆయన సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సెంటర్ ఇంన్‌చార్జీలను ఆయన ఆదేశించారు. సోమవారం జరిగిన థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 6,206 మంది విద్యార్థులకు 6,202 మంది విద్యార్థులు హాజరయ్యారని, మొత్తంగా 99.94 శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, చీఫ్ సూపరింటెంట్లు మల్లారెడ్డి, రవీందర్ ఉన్నారు.

మోడల్ స్కూల్ సందర్శన

మండలంలోని నమిలిగొండ శివారులో ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్‌ను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు, అడిషనల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసచారి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. పనులు ఎలా జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బోధన తీరును, పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదోతరగతి పరీక్షల తీరును ఆయన పరిశీలించారు. ఆయనవెంట ఎంఈఓ కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్, డీసీఈబీ సహాయ కార్యదర్శి రామరాజు, కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత ఉన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

నిబంధనలు విస్మరిస్తే చర్యలు

దేవరుప్పుల: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ నిబంధనలు విస్మరిస్తే శాఖపరంగా చర్యలు అనివార్యమని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయనతోపాటు ఎస్సై ఊర సృజన్‌కుమార్ కలిసి చిన్నమడూరు, దేవరుప్పుల పరీక్ష కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

బచ్చన్నపేట: విద్యార్థులు ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలను రాయాలని తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాల, కొన్నె గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్సై ఎస్‌కే హమీద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం నిర్వహణ బాగుండాలి

- జెడ్పీ సీఈఓ మాధురీషా

లింగాలఘణపురం: చలివేంద్రం ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి రోజు నిర్వహణ బాగుండాలని జెడ్పీ సీఈఓ మాధురీ షా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ చౌరస్తాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులకు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలి కోరారు.



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ మాధురీషా

ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై వాగ్వాదం

- ట్రాక్టర్‌ను ఆపిన ఆర్‌ఐ
- ఆఫీస్‌కు తాళం వేసే ప్రయత్నం..
- మగ్గురిపై కేసు నమోదు

చిల్పూరు: చిల్పూరుకు చెందిన దండిగ యాకయ్య కొత్త ఇంటి నిర్మాణం చేపట్టి బేస్‌మెంట్‌లో నింపేందుకు తన పొలం నుంచి శనివారం ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్నాడు. ట్రాక్టర్లు తహసీల్ కార్యాలయం ముందు నుంచి వెళ్తుండడంతో ఆర్‌ఐ చీకటి వినీత్ ఆపి అనుమతులు ఏవని అడగడంతో తన పొలం నుంచి తెచ్చుకుంటున్నాను.. అనుమతులు ఎందుకని అన్నాడు. దీంతో ఆర్‌ఐ ట్రాక్టరు కీ లాక్కోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆర్‌ఐ ట్రాక్టర్ కీ తీసుకుని ఆఫీస్‌కు వెళ్లాడు. దీంతో యాకయ్యతోపాటు పలువురు రైతులు ఆగ్రహంతో ఆఫీస్‌కు చేరుకుని తలుపులు గుంజి తాలం వేశారు. అనంతరం తెరిచి వెళ్లిపోయారు. అదేరాత్రి ఆర్‌ఐ తన విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన ఎస్సై నవీన్‌కుమార్.. సోమవారం యాకయ్యతోపాటు మట్టి తరలించడానికి సహకరించిన శ్రీనివాస్, సాంబరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంపులను ఆన్ చేసి పంటలను కాపాడండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా



జనగామ: నాలుగు పంపులను ఆన్ చేసి.. మిగిలిన 50శాతం పంటలను కాపాడాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో గళమెత్తారు. సమ్మక్క సాగర్ నుంచి భీం ఘన్‌పూర్, చలివాగు మీదుగా ధర్మసాగర్ చేరి నాలుగు పంపుల ద్వారా గోదావరి జలాలను తరలించే ఆనావాయితీ ఉందన్నారు. యాసంగి సీజన్ మొత్తం నాలుగింటిలో ఏరోజు కూడా ఒక్క పంపు కంటే ఎక్కువ ఆన్ చేయకపోవడంతోనే 50 శాతం మేర పంటలు ఎండిపోయాన్నారు. నాలుగు పంపులను ఆన్ చేస్తే కొన ఊపిరితో ఉన్న పంటలనైనా కాపాడుకునే అకాశం ఉండేదన్నారు. అలాగే జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సిటి స్కాన్ సేవలు ఇంకెప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై ఇప్పటి వరకు మూడు సార్లు నిలదీసినా స్పందించడం లేదన్నారు. జిల్లా ఆస్పత్రిలో కనీస సౌకర్యాలను మెరుగు పర్చాలని అన్నారు. మున్సిపల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు.

వ్యక్తిపై దాడి..

- సెల్ ఫోన్ లాక్కెళ్లిన దుండగులు

జనగామ: పట్టణంలోని గ్రేయిన్ మార్కెట్ ఏరియాలో ఇద్దరు దుండగులు ఓ వ్యక్తి పై దాడి చేసి సెల్ ఫోన్ లాక్కెళ్లిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ఏపీ రాష్ట్రానికి చెందిన నానాజీ గ్రేయిన్ మార్కెట్లోని శ్రీనివాస్ బార్బన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని టాయిలెట్ కోసం వెళ్లిన నానాజీపై ఇద్దరు వ్యక్తులు పిడుగుద్దులతో దాడి చేసి అతని వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కొని పరుగెత్తారు. దీంతో నానాజీకి తల, కన్నుకు గాయాలు కాగా లబోదిబో అంటూ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు స్పందించారు. గుర్తు తెలియని వ్యక్తుల కోసం వెంబడించినప్పటికీ దొరకక పోవడంతో వెనుదిరిగి, ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు చేరారు.



గాయాలపాలైన నానాజీ

రెండేళ్ల తర్వాత అంగన్‌వాడీలో చిన్నారులు

అనారోగ్య కారణాలతో టీచర్ రాజీనామా

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో రెండేళ్ల అనంతరం చిన్నారులతో కేంద్రం పునఃప్రారంభమైంది. దారి లేదనే కారణంతో రెండేళ్లుగా మరో కేంద్రంలో కొనసాగిన సెంటర్‌ను సోమవారం సూపర్‌వైజర్ హంసమ్మ ఆధ్వర్యంలో చిన్నారులతో ఆయా లింగమ్మ వెళ్లి కేంద్రాన్ని నిర్వహించారు. చిన్నారులకు యథావిధిగా రోజువారి కార్యక్రమాలను నిర్వహించారు. కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి కల్పించాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ను సూపర్‌వైజర్ హంసమ్మ కోరగా త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా మూడు నెలలుగా అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్న అంగన్‌వాడీ టీచర్ రాణి ఈ నెల 22న రాజీనామా చేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓకు లేఖ అందజేశారు. దీంతో మండల కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో 1వ కేంద్రంలో టీచర్, 3వ కేంద్రంలో ఆయా పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. ప్రభుత్వం త్వరలో భర్తీ చేయబోయే అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల్లో ఈ రెండు కూడా చేరనున్నాయి.



చిన్నారులతో సూపర్‌వైజర్ హంసమ్మ, ఆయా లింగమ్మ

సంక్షిప్త సమాచారం

'జమిలీ ఎన్నికలతోనే దేశ అభివృద్ధి'

దేవరుప్పుల/చిల్పూరు: జమిలీ ఎన్నికలతోనే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడుగుల రమేశ్, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్ అన్నారు. దేవరుప్పుల మండల కేంద్రంలో, చిల్పూరు మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో ఒకే దేశం.. ఒకే ఎన్నికపై సోమవారం వేర్వేరుగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో వారు పాల్గొని మాట్లాడారు. భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జమిలి ఎన్నికల నిర్వహణతోనే సాధ్యమని, ప్రజాధనంతో పాటు ప్రభుత్వాల కార్య నిర్వహణ సమయం వృథా కాకుండా దోహదపడతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో , పెద్దగాని రాజు, వెలిశాల శ్రీనివాస్, ఐలోని అంజిరెడ్డి, తోకల సంపత్‌రెడ్డి, బాల్నె శ్రీనివాస్, దుబ్బ రాజశేఖర్ గౌడ్, చింత సృజన్, కాసాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలి

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై అండర్ పాస్‌ను నిర్మించాలని ఐద్వా నాయకురాలు బత్తుల అరుణ కోరారు. జిల్లా కేంద్రంలో అండర్‌పాస్ నిర్మించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహ దీక్షలు సోమవారం నాటికి 59వ రోజుకు చేరుకున్నాయి. సీపీఎం శాఖ కార్యదర్శి లింగాల సుగుణ, శిధిరాల ఉపేందర్, బూడిది రాజ్యలక్ష్మి, మహేశ్వరం, అఖిల, కొంపెల్లి యాదమ్మ పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్: యువత మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, సన్మార్గంలో నడవాలని ఎస్సై వినయ్‌కుమార్ అన్నారు. తాటికొండ గ్రామంలో ఎస్సై వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోమవారం గ్రామ ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తదితర నిషేధిత మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు.

జీపీ కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత విధుల నిర్వర్తిస్తూ చాలీచాలని వేతనాలతో బతుకు ఈడిస్తున్న కార్మికుల సమస్యలపై పాలకవర్గాల నిర్లక్ష్యం తగదని జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా, మండల అధ్యక్షుడు బత్తిని వెంకన్న, మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లో తలపెట్టిన కార్యక్రమానికి ప్రతీ కార్మికుడు పాల్గొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

కొడకండ్ల: పేద, బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో రూ.5 లక్షల సీడీఎఫ్ నిధులతో చేపట్టిన యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. మార్కెట్ డైరెక్టర్ వెంకన్న,యాదవ సంఘం అధ్యక్షుడు కొమురయ్య, నాయకులు భిక్షపతి, ఉపేందర్, రాజు, మనోహర్, బుచ్చిరాములు, వెంకటరత్నం, నరేష్, భిక్షపతి, కుమార్, దామోదర్, కొమురెల్లి పాల్గొన్నారు.

ఇన్సినేరేటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొడకండ్ల: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని బాలికల సంక్షేమమే లక్ష్యంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రత్యేక చొరవ తీసుకుని ఇన్సినేరేటర్లను ఏర్పాటు చేయించడం జరిగిందని ఎస్‌ఓ మమత అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కస్తూర్బాలో ఏర్పాటు చేసిన ఇన్సినేరేటర్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందు కోసం ప్రత్యేక చొరవ తీసుకుని యంత్రాలు ఏర్పాటు చేయించిన కలెక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలీమున్నీసా, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

లే అవుట్ క్రమబద్ధీకరణకు 25 శాతం ఫీజు తగ్గింపు

పాలకుర్తి: లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం ఫీజు తగ్గింపు ఉంటుందని ఎంపీడీఓ రాములు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జీపీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీఓ రవీందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాకారుడు కనకరాజుకు గౌరవ డాక్టరేట్



బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన కేమిడి కనకరాజు కళాకారుడు గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారంగంలో తనదైన శైలిలో భక్తి, ధూంధాం, సామాజిక చైతన్య, జానపద, సినిమా, బర్త్‌డేలపై యూట్యూబ్‌లో ఫోక్ పాటలను పాడుతూ పలు వీడియోలను కూడా తీశానన్నారు. ఇందుకు గానూ యూనైటెడ్ నేషన్ -ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ వారి సౌజన్యంతో తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరిలో గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నట్లు చెప్పారు.

వెంకన్నకు ఉగాది పురస్కారం



చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి వెంకన్న ఇటీవల ఉగాది పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకన్న అకాడమీ అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యతేజ సుద్దాంత్ మాస్టారు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ అంతరించి పోతున్న చిందుయక్షగాన కళను అర్ధాకలితో కాపాడుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకుని కళను అన్ని చోట్ల ప్రదర్శించే విధంగా చూడాలని కోరారు.

ఇసుకలోడు ట్రాక్టర్‌ను పట్టించిన గ్రామస్తులు

దేవరుప్పుల: అధికారులు ఇచ్చిన అనుమతుల పేరిట యథేచ్ఛంగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను సోమవారం కడవెండి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

సాగునీరందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

జఫర్‌గఢ్: రైతాంగానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్ ఆధ్వర్యంలో మండలంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన 2వ రోజు పాదయాత్రను సోమవారం చేపట్టారు. తమ్మడపల్లి (ఐ) నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఉప్పుగల్లు, పాముసూరు మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా డప్పుచప్పుల్లు, ఆట పాటలతో పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు అందజేశారు. నాయకులు ఆకుల శ్రీనివాస్, చొప్పరి సోమయ్య, యాదగిరి, రమేశ్, రాజు, అశీర్వాదం, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్‌పాష పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

రఘునాథపల్లి: సాగు నీరందక జిల్లాలో ఎండిన పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సీపీఎం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు పిలుపునిచ్చారు. మండలంలోని రేగడితండా గ్రామ పంచాయతీ పరిధిలోని తండాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గజ్జెల్లి చంద్రయ్య (46) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. కాగా, పలు పార్టీల నాయకులు మృతుడికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా , బీఆర్‌ఎస్ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించి చంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటని, కుటంబానికి పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, మాజీ ప్రజాప్రతినిధులు తేజావత్ గోవర్ధన్, రామిని శివరాజ్ గుప్తా, ఎండీ గౌస్, నాయకులు తదితరులు ఉన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

బచ్చన్నపేట: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఇంజ ఎల్లయ్య కోరారు. సోమవారం మండలంలోని పోచన్నపేట గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవిలో కూలీలకు రోజూ రూ. 600 కూలి ఇవ్వాలన్నారు. అలాగే పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగు నీటి వసతి కల్పించాలన్నారు. కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపుపై శ్రద్ధ వహించాలి

బచ్చన్నపేట: కంటి చూపుపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శరత్ మ్యాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి(హనుమకొండ) వైద్యులు సహజ, మమత అన్నారు. సోమవారం మండలంలోని బండనాగారం గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 100 మందికి కంటి పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కంటి ఆపరేషన్ అవసరమున్నవారిని హనుమకొండకు రావాలని కోరడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి భరత్‌కిషోర్, కారోబార్ ఎర్రోజు శ్రీనివాస్, ఆశ కార్యకర్త, ఇజ్జగిరి అనిత, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి అప్పగింత

దేవరుప్పుల: చిన్నమడూరుకు చెందిన ఓ మైనర్ బాలుడు అదృశ్యం కాగా సోమవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 21వ తేదీన చిన్నమడూరుకు చెందిన మేడ అబ్బసాయిలు కుమారుడు శ్యామ్ ఇంటర్ పరీక్షలు రాస్తున్న క్రమంలో అదృశ్యమయ్యాడు. ఈ విషయమై బాలుడి తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సోమవారం ఆచూకీ లభించింది. ఇంటర్ పరీక్షలు రాయలేక హైదరాబాద్‌లో పనిచేసేందుకు వెళ్లినట్లు పేర్కొనగా మైనర్ బాలుడు అయినందున తహసీల్దార్ ఎం .మహిపాల్‌రెడ్డి ఎదుట వాస్తవిక వాంగ్మూలం నమోదు చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భోజ్యానాయక్‌కు ఘన నివాళి

రఘునాథపల్లి: మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్న లునావత్ భోజ్యానాయక్ 13వ వర్ధంతిని సేవాలాల్ సేనా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి తల్లి మంకిలి, సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ధరావత్ శంకర్, విజయ్‌కుమార్, రమేష్, సుమన్, సక్రు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు